2024 (1) THCR

## తెలంగాణ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానము, హైదరాబాద్

**గౌరవనీయ ప్రధాన న్యాయమూర్తి అలోక్ అరాధే**
**మరియు**
**గౌరవనీయ న్యాయమూర్తి అనిల్ కుమార్ జూకంటి**

**రిట్ పిటిషన్ నెం.26262/2012**
**తీర్పు తేది 30-01-2024**

**ఉదహరించిన పూర్వపు తీర్పులు :**

1. 2004 (3) ALD 449
2. 2015 SCC OnLine Bom 1933
3. 2007 (1) ALT 727
4. 1994 Supp (1) SCC 155

**పిటిషనర్ తరపు న్యాయవాది** : శ్రీ ఎం. సురేందర్ రావు.

**ప్రతివాది తరపు న్యాయవాది** : శ్రీమతి వి. ఉమాదేవి, తెలంగాణ హైకోర్టు స్టాండింగ్ కౌన్సెల్. శ్రీ కె. వివేక్ రెడ్డి, సీనియర్ కౌన్సెల్ మరియు అమికస్ క్యూరీ.

**ఉత్తర్వు: (గౌరవనీయ న్యాయమూర్తి అనిల్ కుమార్ జూకంటి ద్వారా )**

పిటిషనర్ తరపున సీనియర్ న్యాయవాదిగా శ్రీ ఎం. సురేందర్ రావు వ్యవహరించారు.

శ్రీమతి వి. ఉమాదేవి, తెలంగాణ హైకోర్టు స్టాండింగ్ కౌన్సెల్.

ప్రతివాది తరపున శ్రీ కె. వివేక్ రెడ్డి, సీనియర్ కౌన్సెల్ మరియు అమికస్ క్యూరీ.

2. ఈ క్రింది ఉపశమనాలను మంజూరు చేయాలని కోరుతూ రిట్ పిటిషన్ దాఖలు చేయబడింది:

i) పిటిషనర్ పుట్టిన తేదీని 01.07.1949 గా నిర్ణయించి అతని కేసును తిరస్కరిస్తూ గౌరవ ఉన్నత న్యాయస్థానం తీసుకున్న నిర్ణయాన్ని తెలియజేస్తూ Rc.No.702/1998-B2, 21.03.2012లో జారీ చేసిన ప్రొసీడింగ్స్ను చట్టవిరుద్ధంగా, ఏకపక్షంగా ప్రకటించడం.

ii) పిటిషనర్ యొక్క పుట్టిన తేదీని 01.07.1949 బదులుగా 29.05.1953 గా ప్రకటించాలి,

iii) పిటిషనర్ యొక్క పుట్టిన తేదీని 29.05.1953 గా నిర్ణయించడం ద్వారా అన్ని పర్యవసాన ప్రయోజనాలకు అర్హుడు గా ప్రకటించాలి.

iv) పుట్టిన తేదీ 29.03.21953గా నిర్ణయించాలన్న పిటిషనర్ కేసును తిరస్కరించిన మొదటి ప్రతివాది Roc.No.702/1998-B1, తేదీ 21.03.2012లో ప్రొసీడింగ్స్ ను చట్టవిరుద్ధ మని, ఏకపక్షమని ప్రకటించాలి.

**3. సంక్షిప్త వాస్తవాలు:** పిటిషనర్ తేదీ 17.12.1983న డిస్ట్రిక్ట్ మున్సిఫ్ పదవికి చేసుకున్న దరఖాస్తులో అతని పుట్టిన తేదీని 0 1.07.1949 గా పేర్కొన్నాడు. G.O.Ms.No.435 హోమ్ (Court.C) డిపార్ట్మెంట్, తేదీ 21.08.1985 ద్వారా జిల్లా మున్సిఫ్ పదవికి ఎంపికై , తేదీ 17.10.1985న సర్వీసులో చేరాడు.

4. తేదీ 22.08.1989న జిల్లా జడ్జి , శ్రీకాకుళం ద్వారా హై కోర్టుకు ఒక దరఖాస్తు/వినతి పత్రం ఇస్తూ, అతను సర్వీసు లోకి ప్రవేశించడానికి ముందు , చోడవరం జిల్లా మున్సిఫ్ ముందు , పుట్టిన తేదీని 01.07.1949కు బదులుగా 29.03.1953గా మార్చాలని కోరుతూ O.S.No..61/1983 ద్వారా దావా వేయగా కోర్టు అతనికి అనుకూలంగా తీర్పునిచ్చిందని, సర్వీస్ రిజిస్టర్ లో వివరాలు నమోదు చేసే సమయములో అప్పటి విశాఖపట్నం జిల్లా జడ్జి ముందు సమర్పించిన జనన పత్రం ఆధారంగా అతని పుట్టిన తేదీని 29.05.1953గా నమోదు చేశార ని, హయ్యర్ సెకండరీ లీవింగ్ సర్టిఫికేట్ (HSLC) రిజిస్టర్లో అవసరమైన సవరణలు చేయాలని ఆదేశిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తేదీ 09.12.1988న విద్యా శాఖ (ECI), G.O.Rt.No.1739ని జారీ చేసింద ని, తదనుగుణంగా తన సర్వీస్ రిజిస్టర్ లో పుట్టిన తేదీ మార్పు చేయబడింద ని, కావున తన పుట్టిన తేదీని అన్ని రికార్డులలో 01.07.1949 కు బదులుగా 29.03.1953 గా నమోదు చేయాలని అభ్యర్థించారు.

5. ఈ విషయాన్ని గౌరవనీయ న్యాయమూర్తుల పరిపాలనా (అడ్మినిస్ట్రేటివ్) కమిటీ ముందు ఉంచారు. గౌరవ న్యాయమూర్తుల కమిటీ ఈ క్రింది విధంగా తీర్మానించింది:

> "పరిగణించబడింది", సంబంధిత అధికారి/అధికారుల విజ్ఞాపన ఆధారంగా సర్వీస్ రికార్డుల్లో పుట్టిన తేదీ నమోదు చేయబడిందని మరియు సివిల్ కోర్టుల ఉత్తర్వులతో సహా సమర్పించిన మెటీరియల్ విశ్వాసాన్ని కల్పించిందని కాబట్టి, పుట్టిన తేదీల మార్పు కోసం వచ్చిన విజ్ఞప్తులను తిరస్కరించాలని తీర్మానించారు."

6. గౌరవనీయ న్యాయమూర్తుల కమిటీ తీసుకున్న నిర్ణయాన్ని పిటిషనర్ కు 11.11.1997 లేఖ ద్వారా తెలియజేశారు. Roc.No.4518/97-B1 లో తేదీ 11.11.1997 నాటి ఉత్తర్వును సవాలు చేస్తూ, పిటిషనర్ రిట్ పిటిషన్ నెం.930/2002 దాఖలు చేశారు. పుట్టిన తేదీని 01.07.1949 నుండి 29.03.1953 కు మార్చడానికి హైకోర్టు 06.02.2002 నాటి ఉత్తర్వుల ద్వారా రిట్ పిటిషన్ ను అనుమతించింది. ఈ కేసును C.A.No.6964/2004 ద్వారా గౌరవనీయ సుప్రీం కోర్టు ముందు అప్పీలుకు తీసుకువెళ్ళారు. గౌరవనీయ సుప్రీం కోర్టు ఈ క్రింది ఉత్తర్వుల ద్వారా అప్పీలును పరిష్కరించింది.

ఎ) 1984 నిబంధనలలోని రూల్ 2 ప్రకారం హైకోర్టు లోని పరిపాలన విభాగం జ్యుడిషియల్ ఆఫీసర్ ల యొక్క పుట్టిన తేదీని నిర్ణయించాలి.

బి) ఈ ఉత్తర్వు జారీ చేసిన తేదీ నుండి నాలుగు నెలల్లోపు పైన పేర్కొన్న ప్రక్రియను పూర్తి చేయాలి.

సి) ఒకవేళ జ్యుడీషియల్ ఆఫీసర్ పుట్టిన తేదీని 29.03.1953 గా నిర్ణయించినట్లయితే , అన్ని పర్యవసాన ప్రయోజనాలతో అతనిని తిరిగి నియమించడానికి తగిన ఉత్తర్వు వీలైనంత త్వరగా జారీ చేయాలి, ఏ సందర్భంలోనూ ఈ ఉత్తర్వులు నిర్ణయం తీసుకున్న తేదీ నుండి రెండు వారాల లోగా జారీ చేయాలి.

7. గౌరవనీయమైన సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా 26.12.2011న అడ్మినిస్ట్రేటివ్ కమిటీ ముందు ఈ అంశాన్ని ఉంచగా , ఈ విషయాన్ని పరిశీలించి నివేదిక సమర్పించాలని గౌరవనీయ న్యాయమూర్తి శ్రీ ఆశుతోష్ మొహంతాను కోరుతూ కమిటీ తీర్మానించింది. ఆంధ్రప్రదేశ్ పబ్లిక్

ఎంప్లాయిమెంట్ (పుట్టిన తేదీ నమోదు మరియు మార్పు) రూల్స్ , 1984) (క్లుప్తంగా, 'రూల్స్, 1984') ఈ క్రింది విధంగా ఉన్నాయి:

**2. పుట్టిన తేదీని నమోదు చేయడం:-** (1) ప్రతి ప్రభుత్వ ఉద్యోగి తాను విధుల్లో చేరిన నెల రోజుల్లోగా తన పుట్టిన తేదీపై డిక్లరేషన్ ఇవ్వాలి.

(2) ఉప-నియమం (1) కింద చేసిన డిక్లరేషన్ అందుకున్న తరువాత, అటువంటి ప్రభుత్వ ఉద్యోగికి సంబంధించి సర్వీస్ రికార్డ్ ను నిర్వహించే కార్యాలయ అధిపతి లేదా మరే ఇతర అధికారి అయినా, డిక్లరేషన్ కు సంబంధించి తగినదిగా భావించేటటువంటి విచారణ చేసిన తరువాత మరియు ఆ డిక్లరేషన్ కు సంబంధించి ఏవైనా సాక్ష్యాధారాలు ఉంటే వాటిని పరిగణనలోకి తీసుకొని, ప్రభుత్వ ఉద్యోగి సర్వీసులో చేరిన తేదీ నుంచి నాలుగు నెలల్లోపు పుట్టిన తేదీని నిర్ణయిస్తూ ఉత్తర్వులు జారీ చేయాలి:

అయితే, ఈ ఉప -నియమం (1) కింద నిర్ణయించిన పుట్టిన తేదీకి , సంబంధిత ప్రభుత్వ ఉద్యోగి ప్రకటించిన తేదీకి భిన్నంగా ఉన్న సందర్భాల్లో , తుది ఉత్తర్వు ఇవ్వడానికి ముందు అతనికి అభ్యర్ధన చేసేందుకు అవకాశం ఇవ్వబడుతుంది.

(3) ఒకవేళ ప్రభుత్వ ఉద్యోగి సబ్ రూల్( 1)లో పేర్కొన్న గడువులోగా డిక్లరేషన్ ఇవ్వకపోతే, అందుబాటులో ఉన్న సాక్ష్యాలను పరిగణనలోకి తీసుకొని, సంబంధిత ప్రభుత్వ ఉద్యోగికి వినతిపత్రం ఇచ్చే అవకాశం ఇచ్చిన తరువాత , ప్రభుత్వ ఉద్యోగి సర్వీసులో చేరిన తేదీ నుంచి ఆరు నెలల్లోపు ఉద్యోగి పుట్టిన తేదీని నిర్ణయించాలి.

(4) ఈ నియమం ప్రకారం నిర్ణయించబడిన పుట్టిన తేదీ సంబంధిత ఉద్యోగి యొక్క సర్వీస్ రికార్డులలో నమోదు చేయాలి , ఇది కార్యాలయ అధిపతి లేదా సర్వీస్ రికార్డులను నిర్వహించే అధికారి ద్వారా ధృవీకరించాలి మరియు అలా నమోదు చేయబడిన పుట్టిన తేదీ అంతిమం అవుతుంది మరియు ప్రభుత్వ ఉద్యోగులు ఆ విధంగా నమోదైన పుట్టిన తేదీ ని ప్రశ్నించే అర్హత కోల్పోతారు.

(5) పాఠశాల రికార్డుల ఆధారంగా నిర్ణయించిన పుట్టిన తేదీ లేదా సర్వీస్ లోకి ప్రవేశించే సమయంలో సమర్పించిన ఏదైనా రుజువు మరియు సర్వీస్ రికార్డులో నమోదు చేయబడిన తేదీ అంతిమంగా ఉండాలి మరియు ఏ కారణం చేతనైనా పాఠశాల రికార్డులలో పుట్టిన తేదీ

యొక్క తదుపరి మార్పు సర్వీస్ ప్రయోజనం కొరకు సంబందించినదిగా ఉండకూడదు మరియు ఆ ప్రాతిపదికన ప్రభుత్వ ఆదేశాల ప్రకారం , నిజమైన క్లరికల్ లోపం ఉంటే తప్ప, సర్వీస్ రికార్డులలో నమోదు చేసిన పుట్టిన తేదీని మార్చకూడదు. [G.O.Ms.No 94, Fin. & Plg., Dt. 15.03.94 ద్వారా]

## 2A. "సివిల్ కోర్టుల" తీర్పును పరిగణలోకి తీసుకోకూడదు:

సర్వీస్ రికార్డులలో పుట్టిన తేదీని మార్చడానికి ప్రభుత్వం లేదా ఏదైనా కోర్టు, ట్రిబ్యునల్ లేదా ఇతర అథారిటీ ముందు జరిగే ఏదైనా విచారణలో , పాఠశాల లేదా విశ్వవిద్యాలయ రికార్డులలో పుట్టిన తేదీ మార్పుకు సంబంధించి సివిల్ కోర్టు యొక్క డిక్రీ లేదా అటువంటి డిక్రీకి దారితీసే తీర్పులోని విషయాలు , లేదా ఈ నిబంధనలకు విరుద్ధంగా దాని అమలు ప్రభావాన్ని పరిగణనలోకి తీసుకోరాదు మరియు పాఠశాలలో లేదా విశ్వవిద్యాలయ రికార్డులలో పుట్టిన తేదీని మార్చడానికి సంబంధించి సివిల్ కోర్టు యొక్క ఏదైనా తీర్పు డిక్రీ లేదా ఉత్తర్వులో ఏమైనప్పటికీ , ప్రభుత్వం అటువంటి కార్యకలాపాలకు పార్టీ అవుతుందా లేదా అనే దానిపై ఈ నియమాలు ప్రభావం చూపుతాయని దీని ద్వారా ప్రకటించబడింది. [G.O.Ms.No.383, Fin. & Plg., Dt. 16.11.1993 w.e.f. 21.04.1984 ద్వారా జోడించబడింది]

**3. ఈ నిబంధనల ప్రారంభానికి ముందు నియమించబడిన ఉద్యోగుల పుట్టిన తేదీని నమోదు చేసే విధానం :** ఈ నిబంధనలు ప్రారంభానికి ముందు నియమితులైన , సర్వీస్ రిజిస్టర్ తెరవని ప్రభుత్వ ఉద్యోగి పుట్టిన తేదీని రూల్ -2లో పేర్కొన్న విధంగా నమోదు చేయాలి.

**4. గత సందర్భాల్లో పుట్టిన తేదీ మార్పు:**రూల్ 4ను సబ్ రూల్ (1) గా తిరిగి మార్చారు.

(1) ఈ నిబంధనలు అమల్లోకి రాకముందు ఏ ప్రభుత్వ ఉద్యోగి కూడ:

(ఎ) తనకు వర్తించే నిబంధనలకు అనుగుణంగా సర్వీస్ రిజిస్టర్లో తన పుట్టిన తేదీ నమోదు చేయబడిందో; లేదా

(బి) తన ఈ నియమాలు అమలులోకి రాకముందే తన పుట్టిన తేదీ అంతిమంగా నమోదు చేయబడినట్లయితే,

అతను తన పుట్టిన తేదీ మార్పును క్లెయిమ్ చేయడానికి అర్హత కోల్పోతాడు.

(2) పాఠశాల రికార్డుల్లో పుట్టిన తేదీ యొక్క తదుపరి వ్యత్యాసం సర్విస్ యొక్క ఉద్దేశ్యానికి సంబంధించినదిగా ఉండదు లేదా ఏదైనా కోర్టు ట్రిబ్యునల్ లేదా అధికారి పుట్టిన తేదీని మార్చాలని ఆదేశించడానికి అటువంటి వ్యత్యాసం చెల్లుబాటు అయ్యే ఆధారం కాదు. [G.O.Ms.No 94, Fin. & Plg., Dt. 15.03.94 ద్వారా జోడించబడింది.]

**5. ఈ నియమాలు ప్రారంభమైన తేదీ నాటికి పెండింగ్ లో ఉన్న కేసులు** : ప్రభుత్వ ఉద్యోగులు తమ పుట్టిన తేదీలో మార్పుట కోసం ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న మరియు ఈ నియమాలు అమలులోకివచ్చిన తేదీన పెండింగ్ లో ఉన్న కేసులను, సర్వీసులోకి ప్రవేశించే సమయంలో పాఠశాల మరియు కళాశాల రికార్డులలో నమోదు చేయబడిన వయస్సు ఆధారంగా పరిష్కరించాలి.

**6. నిబంధనల యొక్క ప్రభావం:-** భారత రాజ్యాంగంలోని 309వ అధికరణం ప్రకారం రూపొందించిన లేదా రూపొందించినట్లు భావించే ఏ నియమమూ ఈ నియమాలలోని ఈ నిబంధనలకు అనుగుణంగా ఉన్నంత వరకు ఎటువంటి ప్రభావాన్ని చూపదు.

8. తన దావాకు మద్దతుగా నిలిచే అన్ని విద్యా ధృవీకరణ పత్రాలతో సహా అవసరమైన పత్రాలతో తేదీ 02.03.2012 న జస్టిస్ అశుతోష్ మొహంతా ముందు హాజరు కావాలని పిటిషనర్ కు (రూల్స్, 1984లోని రూల్ 2 (2) కు సంబంధించి) ఒక నోటీసు తేదీ 17.02.2012న జారీ చేయబడింది. పిటిషనర్ హాజరై తన వాదనలు వినిపించారు. తాను 29.03.1953న జన్మించానని పిటిషనర్ చేసిన అభ్యర్ధనను అంగీకరించలేమని పేర్కొంటూ గౌరవ న్యాయమూర్తి 05.03.2012 నాటి నివేదికను సమర్పించారు మరియు పిటిషనర్ 01.07.1949 న జన్మించిన వ్యక్తి అని నివేదిక ఇచ్చారు. పిటిషనర్/ఆఫీసర్ యొక్క వినతి పత్రాన్ని తిరస్కరించటం జరిగింది. ఈ నివేదికనను గౌరవ హై కోర్టు న్యాయమూర్తుల అడ్మినిస్ట్రేటివ్ కమిటీ ముందు పెట్టగా , ఆ కమిటీ కూడ పిటిషనర్ జన్మ తేదీ 01-07-1949 అని , 29-03-1953 కాదని అంటూ గౌరవ అశుతోష్ మోహంతా నివేదికను అంగీకరించారు. దానితో పిటిషనర్ కమిటీ తీర్మానాన్ని సవాలు చేస్తూ రిట్ పిటిషన్ దాఖలు చేశారు.

9. పిటిషనర్ విశాఖపట్నం జిల్లా , వీరవల్లి తాలూకా చోడవరం గ్రామానికి చెందిన వ్యక్తి అని , ఆ గ్రామానికి చెందిన జనన మరియు మరణ రిజిస్టర్ లో పుట్టిన తేదీని 29.03.1953గా నమోదు చేశారని, తన తల్లిదండ్రులు నిరక్షరాస్యులని , ఎవరో తన పుట్టిన తేదీని 01.07.1949గా నమోదు

చేశారని, 1968 ఏప్రిల్ లో 12వ తరగతి పరీక్ష రాశానని , అనకాపల్లిలోని AMAL కళాశాలలో డిగ్రీ, ఆంధ్రా యూనివర్సిటీలో న్యాయశాస్త్రం చదివా రని పిటిషనర్ తరపు న సీనియర్ న్యాయవాది కోర్టుకు నివేదించారు.

10. పిటిషనర్ 1980వ సంవత్సరం నుంచి న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నారు. అతను 18.03.1983 న O.S.No.61 /1983 లో దావా వేశాడు. జిల్లా మున్సిఫ్ పోస్టుకు నోటిఫికేషన్ వెలువడడంతో దరఖాస్తు చేసుకున్నాడు మరియు తేదీ 07.10.1985న నియామక ఉత్తర్వులు కూడా జారీ అయ్యాయి. పైన పేర్కొన్న దావా 28.02.1985 న తీర్పు ఇవ్వబడింది మరియు డిక్రీ ప్రకారం , ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి పుట్టిన తేదీని 29.03.1953 గా నమోదు చేశారు. ఇంతకు పూర్వ HSLC రిజిస్టర్ ప్రకారం పుట్టిన తేదీని 01.07.1949గా నమోదు చేయబడింది.

11. పిటిషనర్ అన్ని రికార్డుల్లో పుట్టిన తేదీని 29.03.1953గా నమోదు చేయాలని కోరుతూ హైకోర్టుకు ప్రాపర్ చానల్ ద్వారా విజ్ఞప్తి చేశారు. హైకోర్టు లోని పరిపాలనా విభాగం ఈ విషయాన్ని అడ్మినిస్ట్రేటివ్ కమిటీ ముందు ఉంచినది, అట్టి అభ్యర్థన తిరస్కరించ బడింది. కమిటీ ముందు రివ్యూ దాఖలు చే సినప్పటికి, అందులోను ఎటువంటి ఉత్తర్వులు జారీ చేయలేదు . దానితో రిట్ పిటిషన్ను దాఖలు చేస్తే అది పిటిషనర్ తరపున అనుమతించారు . ఒక సివిల్ అప్పీ లు సుప్రీం కోర్టు ముందు దాఖలు చేయగా దానిని తగిన ఆదేశాలతో గౌరవనీయమైన సుప్రీంకోర్టు పరిష్కరించింది.

12. సివిల్ కోర్టు డిక్రీ సర్వీసులోకి ప్రవేశించిన తేదీకి ముందే ఉందని, కాగా సర్వీసు రిజిస్టర్ లో దిద్దుబాటు డిసెంబర్, 1988లో జరిగినందున , నిబంధనలలోని నియమం 2- A, 1984 ఒక అడ్డంకి కాదని, నియమం 2-A ను G.O.Ms.No.383, తేదీ 16.11.1993, ద్వారా 21.04.1984 నాడు చేర్చబడిందని, 1989 లో ఒక వినతిపత్రం కూడ ఇవ్వడం జరిగిందని , దాని పై 1997 లో నిర్ణయం తీసుకోబడిందని, అందువల్ల , రూల్స్, 1984 లోని రూల్ 2- A ను అడ్డంకి కాదని పిటిషనర్ తరపు న్యాయవాది తన వాదన వినిపించారు.

13. సివిల్ కోర్టు డిక్రీ సవాలు చేయబడలేదని , ఇందులో వాదనలు జరిగాయని , పిటిషనర్ 11 సంవత్సరాల వయస్సులో 9 వ తరగతిలో ప్రవేశం పొందాడని మరియు 14 సంవత్సరాల వయస్సులో 12 వ తరగతిని పూర్తి చేశాడని , పుట్టిన తేదీ 29.03.1953 అంగీకరించలేమని గౌరవ న్యాయమూర్తి తీర్పు ఇవ్వడం సమంజసం కాదని, అది తప్పని న్యాయవాది వాదన లేవనెత్తారు.

14. హైకోర్టు తరపున హాజరైన స్టాండింగ్ కౌన్సెల్ గౌరవ న్యాయమూర్తి ఇచ్చిన నివేదికలో ఎటువంటి లోపం లేదని , ఈ నివేదికను పరిశీలిస్తే , జారీ చేసిన నోటీసుకు ప్రతిస్పందనగా పిటిషనర్ సమర్పించిన మొత్తం రికార్డులు , సంబంధిత పత్రాలు మరియు ధృవీకరణ పత్రాలను బాగా పరిగణనలోకి తీసుకున్నట్లు తెలుస్తుంద ని, పిటిషనర్ 29.03.1953 న జన్మించాడని నమ్మడానికి సివిల్ కోర్టు యొక్క డిక్రీ విశ్వాసాన్ని ప్రేరేపించలేదని గౌరవ న్యాయమూర్తి తన నివేదికలో సరిగ్గా అభిప్రాయపడ్డారని వాదించారు.

15. సీనియర్ న్యాయవాది మరియు అమికస్ క్యూరీ గౌరవ న్యాయమూర్తి నివేదికను సమర్థించారు. పిటిషనర్ డబుల్ ప్రమోషన్ పొందడానికి ఎటువంటి ఆధారాన్ని లేదా మెటీరియల్ ను సమర్పించలేదని పేర్కొన్నారు. పిటిషనర్ 1968-69 సంవత్సరంలో 12వ తరగతి పూర్తి చేశారని , పిటిషనర్ 1953లో జన్మించినట్లయితే, 12వ తరగతి ఉత్తీర్ణత సాధించడానికి అవసరమైన సాధారణ/ప్రామాణిక సమయం కంటే రెండు సంవత్సరాలు ముందుగానే అంటే అతను కేవలం 15 సంవత్సరాల వయస్సులో 12వ తరగతి పూర్తి చేసినట్లవుతుందని, పిటిషనర్ పుట్టిన తేదీని నిర్ణయించే ప్రక్రియ పెండింగ్ లో ఉన్నందున (రూల్స్, 1984లోని రూల్ 5) రూల్స్, 1984లోని రూల్ 2-A పిటిషనర్ కు వర్తిస్తుందని అమికస్ క్యూరీ పేర్కొన్నారు.

16. **జి.కృష్ణమోహన్ రావు వర్సెస్ రిజిస్ట్రార్ , ఆంధ్రప్రదేశ్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ మరియు ఇతరుల**(2004(3) ALD449) కేసులో లో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఫుల్ బెంచ్ తీర్పులో, పుట్టిన తేదీని నిర్ణయించేటప్పుడు సివిల్ కోర్టు యొక్క డిక్రీ ఎటువంటి కట్టుబాటు చేయదని పేర్కొంది.

**17. ధోండిరామ్ బాపూసాహెబ్ నంగారే వర్సెస్ స్టేట్ ఆఫ్ మహారాష్ట్ర (2015 SCC Online Bom 1933 ) కేసులో** ని తీర్పులో సివిల్ కోర్టు డిక్రీ వ్యక్తిగత డిక్రీ అయినందున అది అందరినీ కట్టుబడి చేయదని పేర్కొంది.

18. 1984 నిబంధనలలోని రూల్ 2 (5) సర్వీస్ రికార్డులు లేదా సర్వీ సులోకి ప్రవేశించేటప్పుడు సమర్పించిన రుజువు ఆధారంగా పుట్టిన తేదీని నిర్ణయించడాన్ని పరిశీలిస్తుం దంటూ సీనియర్ న్యాయవాది **నాగ రాజు** *వర్సెస్* **ఆంధ్రప్రదేశ్ హైకోర్టు (2007(1)ALT)లోని** తీర్పుపై కూడా ఆధారపడ్డారు. గౌరవనీయ న్యాయమూర్తి తన నివేదికలో సంబంధిత అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకున్నారని , అవి విశ్వాసాన్ని కలిగించలేదని సీనియర్ న్యాయవాది వాదించారు.

సమర్పించిన నివేదికలో ఎటువంటి లోపం లేదని, పుట్టిన తేదీని మార్చు దరఖాస్తు/విజ్ఞాపన తిరస్కరించే ఉత్తర్వు సరైనదని, జోక్యం అవసరం లేదని సీనియర్ న్యాయవాది వాదించారు.

19. O.S.No.61/1983 లో దిగువ కోర్టు ఇచ్చిన తీర్పు, గౌరవనీయ న్యాయమూర్తి యొక్క నివేదిక, రికార్డులను పరిశీలించి, న్యాయమూర్తుల వాదనలు విన్నాము.

20. ప్రత్యర్థి సమర్పణలను పరిగణనలోకి తీసుకున్నాము. ఇది భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 226 కింద దాఖలైన పిటిషన్ అనే వాస్తవాన్ని ఈ కోర్టు గుర్తించింది. అయినప్పటికీ, ఈ సమస్య సరైన ముగింపుకు రావడానికి కొన్ని వాస్తవాలను కనుగొనడానికి O.S. నెం. 61/1983 లో ఇచ్చిన తీర్పును పరిశీలించాల్సిన అవసరం మరియు ఆవశ్యకతను ఈ కోర్టు భావిస్తుంది.

21. హైకోర్టులోని గౌరవనీయ న్యాయమూర్తి యొక్క నివేదికను పరిశీలించాము. సివిల్ అప్పీల్ No.6964/2004 లో గౌరవనీయ సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా ఈ నివేదిక ఉంది. హయ్యర్ సెకండరీ స్కూల్ లీవింగ్ సర్టిఫికేట్ (HSSLC) యొక్క ఒరిజినల్ ధృవీకరణ పత్రాన్ని పరిశీలించిన గౌరవనీయ న్యాయమూర్తి, పిటిషనర్ 1964-65 సంవత్సరంలో 9వ తరగతి, 1965-66 సంవత్సరంలో 10వ తరగతి, 1966-67 సంవత్సరంలో 11వ తరగతి మరియు 1967-68 సంవత్సరంలో 12వ తరగతి చదివారని గమనించారు. పిటిషనర్ కు ఎన్నడూ డబుల్ ప్రమోషన్ రాలేదని లేదా కొన్ని తరగతులను దాటవేయలేదని హైకోర్టు గౌరవ న్యాయమూర్తి పేర్కొన్నారు. పిటిషనర్ 14 సంవత్సరాల వయస్సులోనే 12వ తరగతి పూర్తి చేశాడని నమ్మడం సాధ్యం కాదని గౌరవనీయ న్యాయమూర్తి అభిప్రాయపడ్డారు. మెటీరియల్ తోపాటు సివిల్ కోర్టు ఆమోదించిన డిక్రీ దరఖాస్తుదారు 29.03.1953 లో జన్మించాడనే విశ్వాసాన్ని కలిగించలేదని, పుట్టిన తేదీని 01.07.1949 గా తీసుకుంటే, అన్ని సంవత్సరాల చదువులు సాధ్యమయినవి మరియు ఆమోదయోగ్యమైనవిగా ఉన్నాయని పేర్కొన్నారు . పిటిషనర్ 9వ తరగతిలో 1964-65 లో ప్రవేశం పొందాడని చూపించే వాస్తవాలు గౌరవనీయ అత్యున్నత న్యాయస్థానం యొక్క పరిశీలనకు విరుద్ధంగా ఉన్నాయని గౌరవనీయ న్యాయమూర్తి అభిప్రాయపడ్డారు. గౌరవనీయ అత్యున్నత న్యాయస్థానం యొక్క పరిశీలనలు ఈ క్రింది విధంగా ఉన్నాయి:

> "......హైకోర్టు యొక్క పరిపాలనావిభాగం ఈ అప్పీలు కు సంబందించి కొన్ని విషయాలను రికార్డులో ఉంచింది. అటువంటి విషయాలలో ఒకటి ఏమిటంటే, జ్యుడీషియల్ ఆఫీసర్ 6వ తరగతిలో 1961-62 లో ప్రవేశం పొందాడు మరియు

మార్చి 29,1953న జన్మించిన ఎవరైనా ఆ సమయంలో 6వ తరగతిలో ఉండే అవకాశం లేదు, అతనికి అప్పుడు 8 నుండి 9 సంవత్సరాల వయస్సు ఉండవచ్చు."

22. మొత్తం నివేదికను పరిశీలించాము. మాకు ఎటువంటి లోపం కనిపించలేదు. పిటిషనర్ కు తన కేసును ధృవీకరించడానికి అన్ని సంబంధిత విషయాలను పొందుపరచడానికి ఒక అవకాశం ఇవ్వబడింది. వీటిని గౌరవనీయ న్యాయమూర్తి నిష్పాక్షికంగా పరిగణించారు మరియు సమర్పించిన విషయాలు విశ్వాసాన్ని కలిగించవని మరియు సమర్పించిన పుట్టిన తేదీ పత్రం దరఖాస్తుదారుడికి చెందినది కాదని మరియు వారి తల్లిదండ్రులకు జన్మించిన మరొక మగ సంతానానికి సంబందించినది కూడా కావచ్చు అని గౌరవనీయ న్యాయమూర్తి అభిప్రాయపడ్డారు. సంబంధిత విషయాల యొక్క నిష్పాక్షిక పరిశీలన ఆధారంగా నమోదు చేయబడిన వర్గీకరణ ఫలితాన్ని దృష్టిలో ఉంచుకుని, ఈ కోర్టు ఫలితాలను భంగపరచడానికి మొగ్గు చూపదు.

23. జిల్లా మున్సిఫ్ పోస్టుకు 2వ పేజీ కాలమ్ (ఎ) లో సమర్పించిన దరఖాస్తు ఫారంలో, పుట్టిన తేదీ 01.07.1949 గా పేర్కొనబడింది (1వ జూలై పంతొమ్మిది నలభై తొమ్మిది అని కూడా పదాలలో వ్రాయబడింది). 1968-69 సంవత్సరంలో , అతను ZPHS స్కూల్, చోడవరం, బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ , హైదరాబాద్ నుండి సాధారణ విభాగంలో HSSLC పరీక్షలో ఉత్తీర్ణుడయ్యాడని కూడా దరఖాస్తు ఫారంలో పేర్కొనబడింది. దరఖాస్తు ఫారం తేదీ 17.12.1983 మరియు దరఖాస్తుదారు (పిటిషనర్) సంతకం చేశారు. HSSLC రిజిస్టర్ ప్రకారమే పుట్టిన తేదీ చూపించారనడంలో ఎలాంటి సందేహం లేదు. పిటిషనర్ ఇప్పుడు తన దరఖాస్తులో చూపించిన దానికి విరుద్ధంగా, పుట్టిన తేదీ మార్చి 29,1953 అని వాదిస్తున్నారు. పుట్టిన తేదీ మార్పు అంశాన్ని పరిశీలించేటప్పుడు ఈ కోర్టు విస్మరించకూడని ముఖ్యమైన అంశం ఇది.

24. O.S.No.61/1983లోని తీర్పును పరిశీలిస్తే , Ex.A1, A2 మరియు A3 లు పిటిషనర్ తరపున మార్క్ చేయబడ్డా యి. దిగువ కోర్టు ఈ సాక్ష్యాధారాలపై ఆధారపడింది. Ex.A1, తేదీ 24.12.1981 అనేది చోడవరం తహసీల్దార్ జారీ చేసిన చోడవరం గ్రామానికి సంబంధించిన 1953 సంవత్సర జనన రిజిస్టర్ యొక్క నకలు; Ex.A2, తేదీ 17.07.1981 తాలూకా కార్యాలయంలో పిటిషనర్ దాఖలు చేసిన దరఖాస్తు కాపీ. Ex.A3, తేదీ 28.07.1981 చోడవరం తహసీల్దార్ యొక్క ధృవీకరణ.

25. ఈ పత్రాలన్నింటిలో చెప్పుకోదగిన లక్షణం ఏమిటంటే, అవన్నీ 1981 సంవత్సరానికి సంబంధించినవి. పిటిషనర్ జిల్లా మున్సిఫ్ పోస్టుకు దరఖాస్తులో పుట్టిన తేదీని జనన రిజిస్టర్ అంటే Ex.A1 యొక్క సర్టిఫైడ్ కాపీ ప్రకారం నమోదు చేయడానికి బదులుగా 01.07.1949 గా చూపించారు. ఇది ఒక కీలకమైన అంశం, దీనిని విస్మరించలేము మరియు ఇది పిటిషనర్ వాదనను తిరస్కరిస్తుంది.

26. తీర్పులో ప్రతివాదుల తరఫున Exs.B1 మరియు B2 గుర్తించబడ్డా యి. Ex.B1 తేదీ 19.06.1961 ZPHS స్కూల్ చోడవరంలో ప్రవేశానికి సంబంధించిన రికార్డు పత్రం. Ex.B2 తేదీ 24.06.1961 చోడవరం లోని ZPHS పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తు ఫారం. Exs.B1 మరియు B2 రెండూ పిటిషనర్ కు సంబంధించినవి. దిగువ కోర్టు తీర్పులోని 6.g పేరాలో ఈ క్రింది విధంగా పేర్కొంది:

> "...... నిస్సందేహంగా, Exs.B1 మరియు B2 పిటిషనర్ పుట్టిన తేదీ 01.07.1949 అని చూపుతాయి."

కానీ, ఆశ్చర్యకరంగా, ఈ క్రింది ప్రకటనను జతచేస్తుందిః

> "........అతనికి తక్కువ వయస్సు ఉన్నందున పాఠశాలలో ప్రవేశాన్ని సులభతరం చేయడానికి వయస్సు డిక్లరేషన్ ఇచ్చే అవకాశం ఉంది."

27. O.S.No 61/1983లో ఇచ్చిన తీర్పును పరిశీలిస్తే, ముఖ్యంగా పేరా 6 నుంచి 6.1 వరకు పుట్టిన తేదీ అనే ప్రధాన సమస్య విషయంలో కోర్టు వ్యవహరించిన తీరును పరిశీలిస్తే , కోర్టు ఈ సమస్యను సరైన దృక్పథంతో పరిష్కరించలేదని తెలుస్తోంది. పుట్టిన తేదీకి సంబంధించి నిర్ధారణకు రావడంలో దిగువ న్యాయస్థానం ఘోరమైన పొరపాటు చేసింది.

28. సర్వీస్ రికార్డులో పుట్టిన తేదీ మార్పుకు సంబంధించిన వివాదాలను వివిధ హైకోర్టులు మరియు గౌరవనీయ సర్వోన్నత న్యాయస్థానం పరిశీలించాయి. "పుట్టిన తేదీని సరిదిద్దడాన్ని హక్కుగా పేర్కొనలేం. " అనేది స్థిరపడిన శాసనము.

29. **హోం డిపార్ట్ మెంట్** *వర్సెస్* **వి.ఆర్. కీరుబాకరన్**(1994 **Supp**(1) **SCC155**) కేసులో గౌరవనీయమైన సర్వోన్నత న్యాయస్థానం, క్రింది విధంగా గమనించింది:

"7. పుట్టిన తేదీని సవరించే దరఖాస్తును ట్రిబ్యునల్ లేదా హైకోర్టు సంబంధిత ప్రభుత్వ ఉద్యోగిని మాత్రమే దృష్టిలో ఉంచుకుని పరిష్కరించకూడదు. సంబంధిత ప్రభుత్వోద్యోగి పుట్టిన తేదీని సవరించడం ద్వారా అటువంటి ఆదేశాలు గొలుసు ప్రతిచర్యను కలిగి ఉంటాయని ఎత్తిచూపాల్సిన అవసరం లేదు , ఎందుకంటే అతని క్రింద సంవత్సరాల పాటు వేచి ఉన్న ఇతరులు, పదోన్నతుల కోసం ఈ ప్రక్రియలో ప్రభావితమవుతారు. కొంతమంది కోలుకోలేని గాయంతో బాధపడే అవకాశం ఉంది, ఎందుకంటే, పుట్టిన తేదీని సరిదిద్దడం వల్ల, సంబంధిత అధికారి, కొన్ని సంవత్సరాలు పదవిలో కొనసాగుతారు, ఆ సమయంలో సీనియారిటీలో ఆయన కంటే తక్కువ ఉన్న చాలా మంది అధికారులు తమ పదోన్నతి కోసం ఎదురుచూస్తూ, ఎప్పటికీ పదోన్నతిని పొందలేకపోవచ్చు".

30. ***కర్ణాటక రూరల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ లిమిటెడ్*** *వర్సెస్* ***టి. పి. నటరాజ మరియు ఇతరులు*** సివిల్ అప్పీల్ No.5720/2021 లో, గౌరవనీయమైన సర్వోన్నత న్యాయస్థానం పుట్టిన తేదీ మార్పుపై ఈ క్రింది విధంగా పేర్కొంది.

"(i) వర్తించే సంబంధిత నిబంధనలు/నిబంధనలకు అనుగుణంగా మాత్రమే పుట్టిన తేదీ మార్పు కోసం దరఖాస్తు చేయాలి.

(ii) బలమైన సాక్ష్యాధారాలు ఉన్నప్పటికీ, దానిని హక్కుగా చెప్పలేము.

(iii) దరఖాస్తు ఆలస్యం మరియు జాప్యం కారణంగా మరియు ముఖ్యంగా ఇది సర్వీస్ చివరిలో చేసినప్పుడు లేదా ఉద్యోగి పదవీ విరమణ వయస్సును చేరుకున్న తర్వాత లేదా పదవీ విరమణ చేయబోతున్నప్పుడు దానిని తిరస్కరించవచ్చు".

31. పై కారణాలచేత పిటిషనర్ పుట్టిన తేదీని మార్చడానికి చేసిన దరఖాస్తును మేము పరిగణనలోకి తీసుకోలేము. సర్వీస్ రికార్డుల్లో నమోదు చేసిన పుట్టిన తేదీని మార్చడానికి నిబంధనలు -1984 అనుమతించవు. ఉద్యోగి చేసిన ఎంట్రీలు అంతిమమైనవి మరియు కట్టుబడి ఉంటాయి అలాగే పుట్టిన తేదీ యొక్క ఖచ్చితత్వాన్ని వివాదం చేయకుండా ఉద్యోగి తొలగించబడతాడు. సివిల్ కోర్టు ఇచ్చిన తీర్పు, డిక్రీ లేదా ఆర్డర్ ఆధారంగా పుట్టిన తేదీని మార్చడానికి నిబంధనలు అనుమతించవు మరియు ఎటువంటి అనుగ్రహం చూపించలేదు.

32. పుట్టిన తేదీని సవరించాలనే వాదనను ఆమోదించడం అనేది 1984 నిబంధనల వెనుక ఉన్న ఉద్దేశ్యాన్ని పూర్తిగా నిరుత్సాహపరుస్తుంది. పిటిషనర్ పుట్టిన తేదీ మార్పుకు సంబంధించిన వాదనల గురించి చట్టంలో కానీ , వాస్తవాలపై కానీ ఈ కోర్టు సంతృప్తి మేరకు నిరూపించలేకపోయాడు . సర్వీస్ రికార్డుల్లో పుట్టిన తేదీని తప్పుగా నమోదు చేయడం గురించి రుజువు చేయాల్సిన బాధ్యత దరఖాస్తుదారుపై ఉందని స్థిరమైన , చట్టపరమైన వైఖరి దృష్ట్యా , మార్పు కోసం దావాను స్వీకరించలేము. "పుట్టిన తేదీని సరిదిద్దడం హక్కుగా చెప్పుకోవడానికి వీల్లే దు" అనేది స్థిరమైన చట్టం.

33. పిటిషనర్ తన పాఠశాల రికార్డుల్లో పుట్టిన తేదీని సరిదిద్దే ప్రయత్నం చేయలేదు. పాఠశాల రికార్డుల్లో పుట్టిన తేదీని సరిచేసిన తర్వాత హెచ్ ఎస్ ఎస్ ఎల్ సీలో కూడా పిటిషనర్ వాటిని సరిదిద్దుకునే అవకాశం ఉంది. అయితే, ఇది కూడా జరగలేదు. అందువల్ల నేటికీ పాఠశాలలు/కళాశాల రికార్డులతో పాటు హెచ్ ఎస్ ఎస్ ఎల్ సీ , రెండింటిలోను పిటిషనర్ పుట్టినతేదీ 29.03.1953 since (01-07-1949) గానే ఉంది. పిటిషనర్ తన పుట్టిన తేదీని సర్వీస్ రికార్డులో సరిదిద్దడానికి అనుమతించడం వల్ల అతని పాఠశాల రికార్డులు /HSSLC రికార్డులు మరియు సర్వీస్ రికార్డులలో వేర్వేరు తేదీలు నమోదు చేయబడే అసంబద్ధమైన పరిస్థితి ఏర్పడుతుంది, ఇది అనుమతించబడదు.

34. రిట్ పిటిషన్ లో యోగ్యతలు లేని కారణంగా దానిని కొట్టివేస్తున్నాము. ఖర్చులకు సంబంధించి ఎలాంటి ఉత్తర్వులు లేవు.

ఇతర పిటిషన్లు, ధరఖాస్తులు ఏవైనా పెండింగ్ లో ఉంటే అవి కూడా మూసివేయబడ్డాయి .